ఊరూరా ఉగాది సంబరాలు

- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం
- ఇల్లు వాకిళ్లు ముస్తాబు చేసిన మహిళలు
- తెల్లవారుజామునే పొలం బాట పట్టిన రైతులు
- ప్రత్యేక పూజలతో కిక్కిరిసిన ఆలయాలు
- పంచాంగ శ్రవణం వినిపించిన అర్చకులు


మాచర్లలో గ్రామస్తులకు పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పురోహితుడు


సుంకులమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

అలంపూర్: నియోజకవర్గ ప్రజలు ఉగాది పండుగను ఘనంగా చేసుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని పిండి వంటలతో భగవంతుడికి నైవేద్యం సమర్పించారు. షడ్రుచులతో తయారు చేసిన పచ్చడితో సాంప్రదాయానికి స్వాగతం పలికారు. దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలో వెలిసిన శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయంలో పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు దర్శించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పండుగ సంప్రదాయానికి స్వాగతం పలుకుతూ క్రీడా ఉత్సవాలను, ఆటపాటలతో అలరింపజేశారు. పలు గ్రామాల్లో పంచాంగ శ్రావణం వినిపించారు.

గట్టు: మండలంలో వివిధ గ్రామాల్లో క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిలోని పులుపు, వగరు, చేదు, తీపిలను సమ పాళ్లతో స్వీకరించినట్లే, జీవితంలో కూడా కష్ట సుఖాలను సమానంగా స్వీకరించి, వాటిని అధిగమించాలని పేర్కొన్నారు. రైతు సోదరులు తెల్లవారు జామున కాడెద్దులతో వ్యవసాయ పొలానికి చేరుకుని సేద్యపు పనుల ప్రారంభానికి భూమి పూజ చేశారు. సాయంత్రం ఆలయాల దగ్గర పంచాంగ శ్రవణం నిర్వహించారు. మాచర్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం దగ్గర పంచాగ శ్రవణం నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగను చేసుకున్నారు. రైతులు కాడి ఎడ్లను అలంకరించి తెల్లవారుజామున పంట పొలాలకు వెళ్లి భూమికి పూజలు చేసి, తొలి సేద్యం ప్రారంభించారు. భీమరాయుడి ఆలయంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి ఆధ్వర్యంలో పురోహితుడు మద్ది చాణక్య స్వామి పంచాంగ శ్రవణం ప్రటించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది పండగను ఘనంగా నిర్వహించారు. ఈ పండగ సమయానికి పొలాల్లోని పంటలు పూర్తి కావడంతో రైతులు పాడిపశువులను భక్తిశ్రద్ధలతో పూజించి పొలాల్లో మొదటి దుక్కి దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం కాడెద్దులతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

ధరూరు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి, కోతులగిద్ద శ్రీ అర్ధణేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి నైవేద్యాలు, మొక్కులు తీర్చుకున్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. అర్చకులు చేసిన పంచాంగ శ్రవణాన్ని విని రానున్న రోజుల్లో రైతులకు అనుకూల వర్షాలు కురవాలని పూజలు చేశారు. భ్రమరాంబ అడివేశ్వర స్వామి, రాంపాటి శివాలయం, వైకుంఠనారాయణ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవం నిర్వహించారు.

శాంతినగర్: క్రోధినామ ఉగాది పర్వదిన వేడుకలను వడ్డేపల్లి పుర పరిధిలోని ఆయా వార్డులు, మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం, పొలాల్లోకి వెళ్లి ఎడ్లకాడిలతో కొత్తగా పనులు చేపట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. రామాపురంలో ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి వారిని గ్రామంలోని వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. ఈసందర్భంగా స్వామివారి శోభాయాత్రను నిర్వహించారు. దీంతో గ్రామంలో భక్తి పారవశ్యంతోపాటు భగవన్నామ స్మరణలు మార్మోగాయి.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా ఉగాది సంబరాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. తెలుగు సంవత్సరాది ఉగాది పంచాంగ శ్రావణ కార్యక్రమం నిర్వహించారు.

ఉండవెల్లి: మండలంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పంట పొలాల్లో రైతులు తొలకరి దుక్కి దున్ని వర్షం కోసం ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టారు. ఎద్దుల బండ్లపై పంట పొలాలకు యువకులు పరుగులు తీశారు.


శాంతినగర్ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


గోమాతకు పూజలు నిర్వహించి పశుగ్రాసం తినిపిస్తున్న భక్తులు


రాంపాటి శివాలయంలో భక్తుల పూజలు


అయిజలో కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ


ఉండవెల్లిలో పంట పొలంలో ఎద్దులతో యువకుడు


చెన్నిపాడులో పంచాంగం చదివి వినిపిస్తున్న పండితులు

క్లుప్తంగా

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



అయిజ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఈడుగోనిపల్లిలో మంగళవారం అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బుధవారం ఆలయం సమీపంలో రేలారే.. రేల జానపద కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమ, కోలాట సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం వడ్లందొడ్డి నుంచి నందిన్నె గ్రామానికి తరలిస్తుండగా, అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సమాచారం మేరకు నందిన్నె శివారులో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ల డ్రైవర్లు ఆంజనేయులు, నర్సింహులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మల్దకల్: ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం మల్దకల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సురేష్‌గౌడు వివరాల ప్రకారం.. గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఈరన్న ట్రాక్టర్‌తో మండలంలోని తాటికుంట గ్రామానికి ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మంగళవారం తాటికుంట గ్రామ సమీపంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎర్రవల్లిచౌరస్తా: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన పూల మధుకు కొంత కాలం నుంచి మతి స్థిమితం సక్రమంగా లేదు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ రోజు ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఈ వ్యక్తి ఎవరికైనా కనిపించినా లేదా ఆచూకీ తెలిసినా 8499812689, 6301304558 ఫోన్ నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందిచాలని వారు పేర్కొన్నారు.

పాతబోర్లకు మరమ్మతులు



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఆదేశాల మేరకు పాతబోర్లకు మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నిపాడు, బోరవెల్లి, కలుకుంట్ల, పెద్దపోతులపాడు గ్రామాలలో పాతబోర్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఉగాది పర్వదినం రోజు బోర్లను ప్రారంభించారు. అనంతరం మిషన్‌భగీరథ ట్యాంక్‌లకు లింక్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు నింబంధనలు పాటించాలి

మానవపాడు: ప్రతి ఒక్కరు రోడ్డు, రవాణా నింబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. మంగళవారం మండలంలో ప్రధాన కూడళ్లలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సర ఉగాది శుభాకాంక్షలుతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని తెలిపారు. హెల్మెట్ ధరించాలని, అధిక సంఖ్యలో వాహనాల్లో ప్రయాణించరాదని సూచించారు. బెల్ట్ షాపులలో మద్యం అమితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ధరూరు: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. అందులో భాగంగానే మంగళవారం గద్వాల – రాయచూరు రహదారిలో ఎస్ఐ విజయ్‌కుమార్ కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో డబ్బులు తరలింపు రూ.50వేలలోపే ఉండాలన్నారు. అంతకు మించి ఎక్కువగా తీసుకెళ్తే.. తగిన ఆధారాలు, రశీదులు చూపించాలన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు.



సమస్యల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


మల్దకల్‌లో గదుల కొరతతో చెట్ల కింద వైద్యసిబ్బందితో సమావేశం



మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 24ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా నిర్మించడంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో సరైన వసతులు లేకపోవడంతో రోగులు ప్రతి నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రికి పూర్తి స్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు సంచరిస్తూ ఆవరణాన్ని అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యసిబ్బందికి సరైన వసతి గదులు లేకపోవడంతో పాటు ప్రసూతిగదిలో సరైన వసతులు లేకపోవడం గమనార్హం. ప్రతినెల వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలకు గదులు లేక ఆస్పత్రి ఆవరణలో చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– రామాంజనేయులు, మల్దకల్

ఆస్పత్రిలో గదుల సంఖ్య పెంచాలి



ఆస్పత్రిలో రోగులకు సరిపడ గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలంలో అయితే ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిలో గదుల సంఖ్యను పెంచి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– సుష్మిత, అమరవాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని జిల్లా డీఎంహెచ్ఓ, రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిస్కరించేందుకు కృషి చేస్తాం.

– స్వరూపారాణి, డాక్టర్ మల్దకల్

ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగు పరచాలి


గట్టు ఆస్పత్రిని సందర్శించి, వివరాలను సేకరిస్తున్న ఐద్వా సంఘం నాయకులు

గట్టు: ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగు పరచాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐద్వా నాయకులు సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ కాలూర్‌తిమ్మన్‌దొడ్డిలో కొత్తగా ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త మండలం ఏర్పడిన తర్వాత అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇప్పటికి ఏర్పాటు చేయలేదన్నారు. వైద్యం కోసం గర్భిణులు గట్టు ఆస్పత్రికి రావాలంటే ఇబ్బందిగా ఉన్నట్లు తెలిపారు. గట్టు ఆస్పత్రిలో రోజుకు 100 నుంచి 120 మంది దాకా ఓపీ నమోదవుతున్నట్లు తెలిపారు. 60 మంది దాకా గర్భిణులు వస్తున్నారని, ఇక్కడ కేవలం 6 పడకలే అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గట్టు ఆస్పత్రిలో సౌకర్యాలను కల్పించడంతో పాటుగా 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట ఐద్వా సంఘం నాయకులు గోవిందమ్మ, జయమ్మ, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో చోరీ

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని చాయ్ దునియా హోటల్లో రూ.11500 విలువైన వస్తువులు చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అలంపూర్ మండ లం లింగన్‌వాయికి చెందిన సలీమ్ చాయ్ దుని యా హోటల్‌ను రెండు నెలల క్రితం ప్రారంభించాడు. సోమవారం రాత్రి బంద్ చేసి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయాన్నే తెరిచి చూస్తే వస్తువులు చెల్లచెదురై ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి వచ్చి పరిశీలించారు. హోటల్ వెనుక భాగంలో రేకును తొలగించి రూ.4 వేలు విలువైన సిగరేట్లు, రూ.1500 విలువైన కూల్‌డ్రింక్స్, రూ.6 వేల నగదు చోరీ చేసినట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

22 నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


రామాపురంలో ప్రారంభోత్సవానికి ముస్తాబైన ఉభయలింగేశ్వరస్వామి ఆలయం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన పార్వతిదేవి సమేత ఉభయలింగేశ్వరస్వామి, వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 22 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు తెలిపారు. 22 సోమవారం నుంచి పాడ్యమి 24 వరకు ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. పార్వతిమాత సమేత ఉభయలింగేశ్వర స్వామివారి ప్రతిష్ఠతో పాటు వరసిద్ధి వినాయక స్వామి, కుమారస్వామి, సప్తమాతృక, ఆంజనేయ స్వామి, నాగ, ధ్వజస్తంభ, నాభి, నందీశ్వరస్వామి వారి సామూహిక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు, కోటి రూపాయలతో నిర్మించిన నూతన దేవాలయం ప్రారంభోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయం ప్రత్యేక రాయి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన శిల్పులతో కోటి వెచ్చించి ప్రత్యేకంగా నిర్మించడంతో వెయ్యి ఏళ్లపాటు చెక్కుచెదరదని శిల్పులు భరోసా ఇచ్చినట్లు ధర్మకర్తలు వివరించారు. ఆలయ నిర్మాణానికి, విగ్రహాల ప్రతిష్ఠకు విరాళాలతో పాటు సహాయ, సహకారాలు అందించిన గ్రామ పెద్దలు, ప్రజలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు పార్వతి సమేత ఉభయలింగేశ్వరస్వామి కృపకు పాత్రులవుతారని ధర్మకర్తలు పేర్కొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అమరచింత: పట్టణంలోని మాల కాలనీలో చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమాన్ని మాల జన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 1977లో మాలల కోసం మఠం బావి సేట్ నుంచి ప్రభుత్వం ఎకరా 20 గుంటల భూమిని కొనుగోలు చేసి 23 మందికి ఇంటి స్థలాలకు కేటాయించారన్నారు. మిగిలిన పది శాతం భూమిలో బడి, గుడి నిర్మాణం కోసం అప్పట్లో స్థలాన్ని ఖాళీగా ఉంచారని తెలిపారు. ప్రస్తుతం ఖాళీ స్థలాన్ని కొంత మంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో తమ స్థలాన్ని కాపాడుకునేందుకు ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాల జన సంఘం నాయకులు వెంకట్రాములు, వెంకటస్వామి, రామస్వామి, శేఖర్, రమేష్, సూరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

రాజోళి: మండలంలోని పచ్చర్లలో వాలీబాల్ టోర్నీని మంగళవారం గ్రామ పెద్దలు ప్రారంభించారు. గ్రామంలోని దస్తగిరయ్య, గోకారమయ్య ఉర్సు సందర్భంగా పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. వ్యక్తిగతంగా కాకుండా క్రీడా స్ఫూర్తితో ఆడాలని, ఆడే ఆట అందరిని ఆకర్షించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. శారీర దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఆటలను ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

చిన్న తాండ్రపాడులో చలివేంద్రం


చలివేంద్రం ప్రారంభిస్తున్న కిషోర్ కుమార్

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులో మంగళవారం భగత్‌సింగ్ యూత్ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిషోర్‌కుమార్ హాజరయ్యారు. రిబ్బన్ కట్‌చేసి చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ఎనిమిది గ్రామాల ప్రజలు చిన్నతాండ్రపాడు గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తారని, ప్రయాణికుల కోసం భగత్‌సింగ్ యూత్ సభ్యులు వేసవికాలం చలివేంద్రం ఏర్పాటు చేశారని అభినందించారు. దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ యూత్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు పరశురాముడు, సభ్యులు సురేష్, సతీష్, శేఖర్ పాల్గొన్నారు.